శుక్రవారం,ఏప్రిల్ 5, 2024
4 PM
నినాదం
నిఖార్సైన జర్నలిజం
Smart Edition

బయటకు రావొద్దని హెచ్చరిక..!

హైదరాబాద్‌తో పాటు తెలంగాణలో రాగల రెండురోజులు వడగాలులు వచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. అదే సమయంలో ఎండల తీవ్రత సైతం రెండు, మూడు డిగ్రీలు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని పేర్కొంది. రాష్ట్రంలో ఎండలు 43డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయని.. ఉదయం 11 నుంచి సాయంత్రం 4.30 గంటలకు ప్రజలు బయటకు రావొద్దని హెచ్చరించింది. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లే జాగ్రత్తలు తీసుకోవాలని.. ఎల్లుండి తర్వాత ఉష్ణోగ్రతలు కాస్త తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని తెలిపింది.

రైతులు ధైర్యంగా ఉండాలి..

ముగ్ధంపూర్‌లో కేసీఆర్ పిలుపు

రైతులు ధైర్యంగా ఉండాలని బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు రైతన్నలకు పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా రూరల్ మండలం ముగ్ధంపూర్‌లో ఎండిపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పొలాలకు నీటి సమస్యలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలువురు రైతులు గులాబీ దళపతి ముందు సమస్యలు ఏకరువు పెట్టారు. సాగునీటికి తీవ్ర ఇబ్బందవుతుందని తెలిపారు. గత సంవత్సరం నీరు సంవృద్ధిగా ఉండేదని.. వరి కోత కోసేందుకు ఇబ్బందయ్యేదని పేర్కొన్నారు. ఇప్పుడు పొలమంతా ఎండిపోయింది.. ఒకసారి వాగులోకి నీళ్లిస్తే రైతులందరు బతుకుదురని చెప్పారు. మంచినీళ్లకు కూడా గోసవుతుందని ఓ రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. పోయిన సంవత్సరం మండుటెండల్లో కూడా చెక్‌డ్యామ్‌లు మత్తడి పోశాయని.. ఈ సంవత్సరం చుక్కా లేకుండా అడుగంటిపోయాయని మరో రైతు తెలిపారు. స్పందించిన కేసీఆర్ రైతులకు బీఆర్ఎస్ అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. రైతులు ధైర్యంగా ఉండి పోరాటం చేయాలన్నారు. రైతులకు బీఆర్ఎస్ మద్దతు ఉంటుందని తెలిపారు.

02

అన్న వస్త్రాల కోసం పోతే..

ఉన్న వస్త్రాలు పోయినట్లయ్యింది..
కాంగ్రెస్ పాలనపై హరీశ్‌రావు సెటైర్లు

- ధాన్యం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఏది?
- కాంగ్రెస్ పాలనలో కన్నీళ్లు పెరిగాయి..
- నిరుద్యోగ భృతిపై భట్టి అబద్ధాలు..
- రైతులకు బ్యాంకులు నోటీసులు
- ఆడబిడ్డల ఖాతాల్లో ప్రతినెలా రూ.2500 ఏవి..?
- నిరుద్యోగ యువతకు నెలకు రూ.4వేలు ఇస్తామని రేవంత్ మోసం: ఎమ్మెల్యే హరీశ్‌రావు

02

ఫోన్ ట్యాపింగ్

ఫోన్ ట్యాపింగ్‌లో మరో సంచలనం..
మునుగోడు ఉపఎన్నికల్లోనూ..

హైదరాబాద్: తీగ లాగితే డొంకే కదులుతోంది. ఫోన్ ట్యాపింగ్ కేసు రోజుకో సంచలనం వెలుగు చూస్తోంది. నల్లగొండకి చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లని స్పెషల్ బ్రాంచ్ పోలీసులు లిఫ్ట్ చేశారు. మునుగోడు ఉప ఎన్నికల నేపథ్యంలో నాయకుల ఫోన్ ట్యాప్ చేసి విన్నట్లు వారిపై అభియోగాలొచ్చాయి. జిల్లాలో ప్రస్తుత ఓ ఎమ్మెల్యే అప్పట్లో మాజీ ఎమ్మెల్యే) సంభాషణను ఎప్పటికప్పుడు అబ్జర్వ్ చేసినట్లు సమాచారం. హైదరాబాద్ రోడ్డులో ఫోన్ ట్యాప్ చేసి వినడానికి ఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో మరి కొంతమంది పోలీసులు సహకరించినట్లు ఆధారాలున్నాయి. వారిపై కూడా అధికారులు నిఘా పెట్టినట్టు సమాచారం. ఇక లిఫ్ట్ చేసిన ఇద్దరు కానిస్టేబుళ్లను హైదరాబాద్ తీసుకువచ్చినట్లు సమాచారం.

ఎస్ఐబీ వేదికగా జరిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో పోలీసుల దర్యాప్తు రోజుకో మలుపు తిరుగుతోంది. హార్డ్‌డిస్క్‌ల ధ్వంసం నుంచి మొదలైన ఈ కేసు.. విపక్ష నేతల ఫోన్ల ట్యాపింగ్, ఎన్నికల సమయంలో డబ్బు తరలింపు, బెదిరింపులు వంటి అంశాల చుట్టూ తిరగ్గా.. తాజాగా మొయినాబాద్ ఫాంహౌసలో ఎమ్మెల్యేల కొనుగోలు కుట్ర కేసుతోనూ లింకులు బయటపడ్డాయి. దీంతో.. మరికొందరు పోలీసు అధికారుల మెడకు ఉచ్చు బిగుసుకుంటున్నట్లు తెలుస్తోంది. 2022 నవంబరులో మొయినాబాద్ ఫాంహౌస్ వేదికగా అప్పటి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పైలట్ రోహిత్‌రెడ్డి, గువ్వల బాలరాజు, రేగా కాంతారావు, హర్షవర్ధన్‌రెడ్డి ఈ ఎపిసోడ్‌తో హాట్‌టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే..! అయితే.. ఈ నలుగురి ఫోన్లను ఎస్ఐబీ డీఎస్పీ హోదాలో ప్రణీత్ అండ్ కో ట్యాప్ చేయడం వల్లే.. అప్పటి బీఆర్ఎస్ సర్కారు ఈ విషయాన్ని ముందుగా గుర్తించినట్లు ఇప్పుడు చర్చ జరుగుతోంది. దాంతో.. పక్కాగా స్కెచ్‌వేసి, ఆ నలుగురు ఎమ్మెల్యేలతోనే ప్రధాన నిందితుడు నందకుమార్, సింహయాజి, రామచంద్ర భారతిలను ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. అప్పట్లో అతి కొద్ది మంది పోలీసు ఉన్నతాధికారులతో ఈ పథకాన్ని అమలు చేయడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.



తెగిన నిజాంసాగర్ కెనాల్ కట్ట .. వ్యక్తి అరెస్ట్

నిజామాబాద్ : నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలో సోమవారం తెల్లవారుజామున నిజాం సాగర్ ప్రధాన కాలువ కట్ట తెగిపోవడానికి కారణమైన ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు.

సదరు వ్యక్తి కెనాల్ కట్టను ఆక్రమించి నిర్మాణం చేపట్టడం వల్లే కట్ట తెగిందని సంబంధిత ఇరిగేషన్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధికారుల ఫిర్యాదు మేరకు ఆ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో రవి కుమార్ తెలిపారు. కాగా, నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో నిజాంసాగర్ కాలువ తెగిపోయింది. సోమవారం తెల్లవారుజామున పట్టణ కేంద్రంలో నిజాంసాగర్ ప్రధాన కాలువ కట్ట తెగిపోయింది. దీంతో కాలువను ఆనుకొని ఉన్న జర్నలిస్టు కాలనీలోకి నీరు వచ్చిచేరింది. మధ్యరాత్రి వేళ ఒక్కసారిగి నీరు ఇండ్లలోకి రావడంతో కాలనీవాసులు పరుగులు పెట్టారు. నీటి ప్రవాహానికి విద్యుత్ స్తంభాలు కింద పడిపోయాయి. దీంతో ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అయితే కాలువ తెగిపోవడానికి ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

కాంగ్రెస్ మేనిఫెస్టోపై కిషన్ రెడ్డి వ్యంగ్యాస్త్రాలు

హైదరాబాద్: నేడు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసిన విషయం తెలిసిందే. రైతులు, మహిళలు, యూత్ టార్గెట్‌గా ఈ మేనిఫెస్టోను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం విడుదల చేసింది. దీనిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. కాంగ్రెస్ పార్టీ ఆఫీస్‌లో నోట్ల ముద్రణ ఏమైనా చేస్తారేమో... తెలియడం లేదని వ్యంగ్యాస్త్రాలు పేల్చారు. శాసనసభ ఎన్నికల్లో డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన అనేక హామీలను ముందుగా కాంగ్రెస్ అమలు చేయాలన్నారు. యూత్ డిక్లరేషన్, మహిళ డిక్లరేషన్, ఎస్సీ.. ఎస్టీ డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన హామీలు ముందుగా అమలు చేయాలన్నారు. దళితుడని బాబూ జగ్జీవన్ రామ్‌ను ప్రధాని కాకుండా కాంగ్రెస్ అడ్డుకుందన్నారు. కాంగ్రెస్ అప్రజాస్వామిక విధానాలను జగ్జీవన్ రామ్ వ్యతిరేకించారన్నారు. ప్రజల హక్కులను పరిరక్షించటానికి జగ్జీవన్ రామ్ పోరాటం చేశారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

02

డిప్యూటీ సీఎం భట్టి కాన్వాయ్‌ని తనిఖీ

హైదరాబాద్ : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వాహనాన్ని(పోలీసులు శుక్రవారం ఖమ్మం జిల్లా మధిర మండలం ఆత్కూరు క్రాస్ రోడ్డు వద్ద తనిఖీ చేశారు. ఎన్నికల నిబంధనలను అనుసరించి పోలీసులకు డిప్యూటీ సీఎం పూర్తిగా సహకరించారు. డిప్యూటీ సీఎం వాహనంతో పాటు ఆయన వెంట ఉన్న ఇతర వాహనాలను సైతం పోలీసులు చెక్ చేశారు. తనిఖీకి సహకరించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు పోలీసులు ధన్యవాదాలు తెలిపారు.

మూగబోయిన తొలి తెలుగు న్యూస్ రీడర్ స్వరం

ప్రముఖ న్యూస్ రీడర్ శాంతి స్వరూప్ కన్నుమూశారు. గుండెపోటుతో ఆస్పత్రిలో చేరిన ఆయన.. చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. రెండురోజుల క్రితం ఆయనకు గుండెపోటు వచ్చింది. దాంతో కుటుంబ సభ్యులు ఆయన్ను యశోదా ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు ఆయనకు చికిత్సనందించారు. దురదృష్టావశాత్తు చికిత్స పొందుతూనే ఆయన కన్నుమూశారు.

తెలుగులో తొలిసారి వార్తలు..

శాంతి స్వరూప్ తెలుగులో తొలిసారి వార్తలు చదివారు. తెలుగు తొలి న్యూస్ రీడర్‌గా చెరగని ముద్ర వేశారు. అంతేకాదు.. పదేళ్లపాటు టెలీప్రాంప్టర్ లేకుండా పేపర్ చూసి చెప్పేవారు. శాంతిస్వరూప్.. 1983 నవంబర్ నుంచి దూరదర్శన్‌లో వార్తలు చదివారు. 2011లో దూరదర్శన్‌లో పని చేసిన ఆయన.. ఆ తరువాత పదవీ విరమణ చేశారు. న్యూస్ రీడర్‌గా లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును కూడా శాంతిస్వరూప్ అందుకున్నారు.

కేసీఆర్ పాలం బాట.. కరీంనగర్‌కు పయనం..

బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళన...

హైదరాబాద్, ఏప్రిల్ 5: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎండిన పంటలను పరిశీలించేందుకు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుక్రవారం ఉదయం బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా రంగదాంపల్లి అమర వీరుల స్థూపం వద్ద పార్టీ అధినేతకు గులాబీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. భారీ కాన్వాయ్‌తో కేసీఆర్‌కు స్వాగతం పలికి ఆయన వెంట కరీంనగర్‌కు పయనమయ్యారు.

కరీంనగర్ జిల్లా ముక్తంపూర్ గ్రామంలో సాగునీరు లేక ఎండిపంటల పొలాలను మాజీ ముఖ్యమంత్రి పరిశీలించనున్నారు. ఆపై రైతులను పరామర్శిస్తారు. మధ్యాహ్నం 1:00 గంటలకు స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఇంట్లో భోజనం చేసి 2:00 గంటలకు బోయినపల్లి మండలంలో ఎండి పోయిన పంట పొలాలను పరిశీలించనున్నారు. అనంతరం 3 గంటలకు మిడ్‌మానేరు రాజరాజేశ్వర జలాశయాన్ని పరిశీలిస్తారు. తరువాత సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో 4:00 గంటలకు మీడియా

సమావేశం నిర్వహించనున్నారు. మీడియా సమావేశంలో కేసిఆర్ ఓ కీలక ప్రకటన చేయనున్నట్లు బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు.

బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళన...

కాగా.. సాగునీరందక పొలాలు ఎండుతుంటే రైతన్నలను కలిసి పరామర్శించి వారి కష్టసుఖాలు తెలుసుకునేందుకు కేసీఆర్ "పొలం బాట" కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా ఈరోజు కరీంనగర్ జిల్లాలో పర్యటించి ఎండిన పంట పొలాలను పరిశీలించి, రైతులను పరామర్శించనున్నారు. బోయినపల్లి, వేములవాడ, సిరిసిల్ల ప్రాంతాల్లో పర్యటించి సాగునీటి సమస్యలను తెలుసుకుంటారు. అయితే కేసీఆర్ పొలంబాట కార్యక్రమాన్ని ప్రకటించగానే కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలో బీఆర్ఎస్ నాయకులు, శ్రేణులు జిల్లాల్లో రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి కరువుకు ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఆరోపిస్తూ ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. కరీంనగర్‌లో బీఆర్ఎస్ నేతలు కలెక్టర్‌ను కలిసి రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం సమర్పించారు. చొప్పదండి నియోజకవర్గ పరిధిలోని రామడుగు, గంగాధర మండలాల్లో పంట పొలాలు ఎండి పోతున్నాయని, సాగునీటి సమస్యను పరిష్కరించాలని, ఎండిన పొలాలకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కరీంనగర్-నిజమాబాద్ రహదారిపై ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆ పార్టీ మాజీ మంత్రి, పెద్దపల్లి ఎంపీ అభ్యరి కొప్పుల ఈశ్వర్, పెద్దపల్లిలో 36 గంటల రైతు నిరసన దీక్షను చేపట్టారు.

అయ్యో.. లోన్ యాప్ ఎంత పనిచేసింది!

సంగారెడ్డి, ఏప్రిల్ 5: అవసరాలకు అప్పులు తీసుకుని వాటిని తీర్చే మార్గం లేక చివరకు ప్రాణాలు కూడా తీసుకుంటున్న ఘటనలు ఎన్నో చూస్తున్నాం. ముఖ్యంగా లోన్ యాప్ సంస్థల వేధింపులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. లోన్ యాప్‌ల ద్వారా రుణాలు పొంది.. సరైన సమయానికి ఈఎంఐలు కట్టలేకపోతుంటారు కొందరు. అప్పు కట్టాల్సిందే అంటూ లోన్ యాప్ నిర్వాహకులు అనేక విధాలుగా వేధింపులకు గురిచేస్తుంటారు. తీసుకున్న మొత్తానికి అప్పు కట్టినప్పటికే అదనంగా చెల్లించాలంటూ ఇంకో రకంగా ఇబ్బందులకు గురిచేస్తుంటారు. లోన్ తీసుకున్న వారి ఫోటోలను సోషల్ మీడియాలో పెడతామంటూ బెదిరింపులకు దిగుతుంటారు. అయినప్పటికీ అప్పులు చెల్లించని పక్షంలో దయాదాక్షిన్యాలు మరిచి... లోన్ తీసుకున్న వారి ఫోటోలను అసభ్యకర రీతితో సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ లోన్‌యాప్ నిర్వాహకులు బరితెగిస్తుంటారు. తాజాగా ఇలాంటి ఘటనలో సంగారెడ్డి జిల్లాలో చోటు చేసుకుంది.

అసలేం జరిగిందంటే...

జిల్లాలోని అందోల్ మండలం కన్సాన్ పల్లి గ్రామానికి చెందిన యువకుడు శ్రీకాంత్ (21) లోన్‌యాప్ ద్వారా రూ.30 వేల రేణం తీసుకున్నాడు. రూ.30 వేల రుణానికి గాను.. నాలుగు నెలల వ్యవధిలో శ్రీకాంత్ దాదాపు రూ.1,30,000 చెల్లించాడు. అయితే ఇంకా అదనంగా మరో రూ.80 వేలు చెల్లించాలంటూ శ్రీకాంత్‌పై లోన్‌యాప్ సిబ్బంది ఒత్తిడి తీసుకొచ్చారు. లోన్ యాప్ సిబ్బందికి డబ్బులు చెల్లించేందుకు యువకుడు నిరాకరించాడు. దీంతో రెచ్చిపోయిన లోన్‌యాప్ సిబ్బంది శ్రీకాంత్ పట్ల దురుసుగా ప్రవర్తించారు. యువకుడిపై సోషల్ మీడియాలో అశ్లీల పోస్టులు పెట్టి మరీ వేధించారు. దాంతో మనస్థాపానికి గురైన శ్రీకాంత్ మార్చి 30న పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబసభ్యులు వెంటనే హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కాగా.. చికిత్స పొందుతూ శ్రీకాంత్ గత రాత్రి కన్నుమూశాడు. శ్రీకాంత్ మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. లోన్‌యాప్ సిబ్బంది ఆగడాలను అరికట్టాలని మృతుని బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

డబ్బులు కొట్టేసేందుకు ఏం చేశారో తెలుసా?

హైదరాబాద్, ఏప్రిల్ 05: ఏటీఎం మిషన్‌లో ఇనుప ముక్కులను అడ్డుపెట్టి వినియోగదారుల డబ్బులు కాజేస్తున్న ఇద్దరిని రెయిన్ బజార్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హరియాణ రాష్ట్రం నూహ్ జిల్లాకు చెందిన తారిఖ్‌ఖాన్(27)మెకానిక్. తాలేబ్ హుస్సేన్ అలియాస్ సమీర్‌ఖాన్(34) ప్రైవేట్ ఉద్యోగి, బోరబండలో నివాసం ఉంటున్న ఇద్దరూ ఏటీఎం విషన్‌లో డబ్బు కాజేయాలని పథకం వేశారు. ఏటీఎం మిషన్‌లో డబ్బు బయటకు వచ్చే ప్రాంతంలో ఇనుప ముక్కలు అడ్డుపెట్టి సమీపంలో ఉండేవారు. ఏటీఎం సెంటర్‌కు వచ్చిన వినియోదారులు కార్డు పెట్టి డబ్బుడ్రా చేసుకోవడానికి యత్నించగా, వారి అకౌంట్‌లో డబ్బు కట్ అయినట్టు మేసేజ్ వస్తున్నది, కానీ డబ్బు మాత్రం రావడంలేదు. వారు బయటకు వెళ్లిపోగానే వారిద్దరు ఏటీఎంలోకి ప్రవేశించి ఇనుప వస్తువును తొలగించి ఇరుక్కున్న నోట్లను తీసుకుని వెళ్లిపోతున్నారు. ఈనెల 1న బాధితుడు రైన్‌బజార్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించి నిందితులను గుర్తించారు. గురువారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.

కేజ్రీవాల్, సిసోడియా అమాయకులు, జైలు నుంచే పాలన..

న్యూఢిల్లీ: ఎక్సైజ్ పాలసీ కేసు లో జైలులో ఉన్న ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ , మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా అమాయకులని 'ఆప్' ఎంపీ సంజయ్ సింగ్ అన్నారు. జైలు నుంచే ఆప్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని చెప్పారు. ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో మార్చి 21న కేజ్రీవాల్ అరెస్టు కాగా, ఇదే కేసులో అరెస్టయిన సంజయ్ సింగ్ ఇటీవల బెయిలుపై విడుదలయ్యారు.

తప్పుడు సాక్ష్యాలతోనే..

ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో తప్పుడు సాక్ష్యాలతోనే కేసులు నమోదు చేసినట్టు సంజయ్ సింగ్ ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో తెలిపారు. బెయిలు పొందడంలో జాప్యం ఎందుకు జరుగుతోందని అడిగినప్పుడు లీగల్ ప్రక్రియలో ఒదొక భాగమని, పీఎంఎల్ఏ చట్టం కింద బెయిల్ లభించడం ఒకింత కష్టమని చెప్పారు. కేసు విచారణలో ఉన్నందున ఇంతకంటే ఎక్కువ మాట్లాడలేనని చెప్పారు. కేజ్రీవాల్‌పై కేసుకు సంబంధించి మాట్లాడుతూ, ఈడీ, సీబీఐలు మొత్తం 456 సాక్షులు ఇచ్చిన స్టేట్‌మెంట్లను రికార్డు చేశాయని, కేవలం నలుగురే సీఎం పేరును ప్రస్తావించారన్నారు. కేజ్రీవాల్ నీతివంతమైన జీవితాన్ని గడిపే వ్యక్తి అని, పిల్లలకు ఉత్తమ విద్య, ఢిల్లీ ప్రజలకు చక్కటి ఆరోగ్య సౌకర్యాలు కల్పించడమే ఆయన లక్ష్యమని చెప్పారు. జైలులో నుంచి ప్రభుత్వాన్ని నడపడంపై అడిగినప్పుడు, ఎందుకు పాలన సాగించరాదని ప్రశ్నించారు. రాజ్యాంగం కూడా ఇందుకు అనుమతి ఇస్తోందన్నారు. ఎవరూ దీనికి అభ్యంతరం చెప్పలేరని, జైలు నుంచి ప్రభుత్వాన్ని నడపాలా వద్దా అనేది బీజేపీనో, ఎల్జీనో నిర్ణయించ లేరని ఆయన స్పష్టం చేశారు .

అన్న వస్త్రాల కోసం పోతే..

ఉన్న వస్త్రాలు పోయినట్లయ్యింది.. కాంగ్రెస్ పాలనపై హరీశ్‌రావు సెటైర్లు

- ధాన్యం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఏది?
- కాంగ్రెస్ పాలనలో కన్నీళ్లు పెరిగాయి..
- నిరుద్యోగ భృతిపై భట్టి అబద్ధాలు..
- రైతులకు బ్యాంకులు నోటీసులు
- ఆడబిడ్డల ఖాతాల్లో ప్రతినెలా రూ.2500 ఏవి..?
- నిరుద్యోగ యువతకు నెలకు రూ.4వేలు ఇస్తామని రేవంత్ మోసం: ఎమ్మెల్యే హరీశ్‌రావు

తెలంగాణ ప్రజల పరిస్థితి అన్న వస్త్రాల కోసం పోతే.. ఉన్న వస్త్రాలు పోయినట్లయ్యిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి అభ్యర్థికి మద్దతుగా మెదక్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హామీలు నమ్మి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటేశారన్నారు. ఒకసారి మోసపోయారు.. మళ్లీమళ్లీ మోసపోతారా? అని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని ఎంపీగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. నమ్మి ఓటేస్తే కాంగ్రెస్ వాళ్లు నట్టేట ముంచారన్నారు. డిసెంబర్ 9న రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్నారు.. ఇప్పటికీ దిక్కులేదని, అప్పు కట్టాలని రైతులకు బ్యాంకులు నోటీసులు ఇస్తున్నాయని గుర్తు చేశారు. రూ.2లక్షలు రుణమాఫీ కానివాళ్లు బీఆర్ఎస్‌కు ఓటెయ్యాలని కోరారు.

ధాన్యం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ఇవ్వలేదని, పక్కపార్టీ వాళ్ల ఇండ్ల చుట్టు రేవంత్‌రెడ్డి తిరుగుతున్నడని విమర్శించారు. రేవంత్‌రెడ్డి రైతులను గాలికి వదిలేసిండని.. వందరోజుల్లో హామీలు నెరవేరుస్తామని చెప్పి కాంగ్రెస్ మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో చురుకు పెడితేనే కాంగ్రెస్ దారికొస్తుందన్నారు. మేం రైతుబంధు ఇస్తామంటే ఎన్నికల కమిషన్‌కు కంప్లయింట్ చేసి ఆపిందని.. రైతుబంధు దుక్కికో.. నాటుకో ఉపయోగపడే డబ్బులు పంట కోతకొచ్చినా రైతుబంధు రాలేదన్నారు. రైతుబంధు కోసం మేం ఉంచిన డబ్బులు కాంగ్రెస్ కాంట్రాక్టర్లకు ఇచ్చిందని.. కాంగ్రెస్ పాలనలో కరెంటు మోటర్లు కాలిపోతున్నాయని తెలిపారు. రైతు భరోసా రూ.15వేలు ఇస్తామని కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. మోసం చేసిన కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పాలనలో ఎప్పుడంటే అప్పుడు నీళ్లిచ్చామని.. రెండు పంటలు పండించుకునేలా కేసీఆర్ నీళ్లిచ్చారన్నారు. కాంగ్రెస్ వంద రోజుల పాలనలో 200 మంది రైతుల ఆత్మహత్య చేసుకున్నారన్నారు.

కాంగ్రెస్ పాలనలో కన్నీళ్లు పెరిగాయి.. కాంగ్రెస్ పాలనలో నీళ్లు తగ్గి కన్నీళ్లు పెరిగినయన్నారు. రూ.4వేలు పెన్షన్ ఇచ్చే వరకు రేవంత్‌కు అవ్వాతాతల కాళ్లు వత్తాలన్నారు. జనవరి నెల పెన్షన్ రేవంత్ సర్కారు ఎగ్గొట్టిందని.. అన్న వస్త్రాల కోసం పోతే.. ఉన్న వస్త్రాలు పోయినట్లయ్యిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని.. కాంగ్రెస్‌కు ఓటేస్తే వాళ్ల అబద్ధాలను ఆమోదించినట్లేనన్నారు. ఆడబిడ్డల ఖాతాల్లో ప్రతినెలా రూ.2500 వేస్తామని రేవంత్ మోసం చేశారని.. కాంగ్రెస్‌ను ఓడిస్తేనే హామీలు అమలు చేస్తారని చెప్పారు. కల్యాణలక్ష్మి లక్షకు తోడు తులం బంగారం ఇస్తానని, నిరుద్యోగ యువతకు నెలకు రూ.4వేలు ఇస్తామని రేవంత్ మోసం చేశారన్నారు.

నిరుద్యోగ భృతిపై భట్టి అబద్ధాలు.. నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పలేదని అసెంబ్లీలో మంత్రి భట్టి అబద్ధాలాడ రన్నారు. కేసీఆర్ ఇచ్చిన 30వేల ఉద్యోగాలకు రేవంత్ నియామకపత్రాలు ఇచ్చారన్నారు. చదువుకునే అమ్మాయి లకు ఎలక్ట్రిక్ స్కూటీ ఇస్తామని మోసం చేశారని.. ఇన్ని మోసాలు చూసినంక కాంగ్రెస్‌కు ఎవరైనా ఓటేస్తారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతిహామీ నెరవేర్చే వరకు వెంటాడుతామన్నారు. దుబ్బాక ప్రజలను బీజేపీ రఘునందన్‌రావు మోసం చేశారన్నారు. రఘునందన్‌రావుని దుబ్బాక ప్రజలు బండకేసి కొట్టారన్నారు. పదేళ్లలో సామాన్యులకు బీజేపీ చేసిందేమీ లేదన్నారు. బీజేపీ పాలనలో పెట్రోల్, డీజిల్, అన్నిరకాల వస్తువుల ధరలు పెరిగాయని.. రాముడి పేరుతో బీజేపీ రాజకీయం చేస్తోందని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

సోషల్ మీడియాలో 'శ్రీవల్లి' రచ్చ

యానిమల్ సినిమాతో నేషనల్ వైడ్‌గా స్టార్ స్టేటస్ దక్కించుకున్న కన్నడ కస్తూరి మన రష్మిక మందన్నా జన్మదినం నేడు (శుక్రవారం). ఈ నేపథ్యంలో హ్యాపీ బర్త్ డే రష్మిక పేరుతో మారు మ్రోగుతోంది. ఇప్పటికే ష్మిక మందన్నా నటిస్తోన్న మూడు పాన్ ఇండియా చిత్రాలు పుష్ప 2 ది రూల్ నుంచి శ్రీవల్లి లుక్‌ను రిలీజ్ చేయగా, ఆ తర్వాత ది గీతా ఆర్ట్స్ వారి గర్ల్ ఫ్రెండ్ , నాగార్జున, ధనుష్‌లతో నటిస్తోన్న కుబేరా చిత్రాల నుంచి కూడా పోస్టర్లు రిలీజ్ చేసి ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

బీఆర్ఎస్ నేత వేధింపులు తాళలేక చిట్ ఫండ్స్ మేనేజర్ ఆత్మహత్యాయత్నం

హనుమకొండ, ఏప్రిల్ 5 : బీఆర్ఎస్ నేత వేధింపులు భరిం చలేక ఓ చిట్ ఫండ్స్ మేనేజర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన జిల్లాలో కలకలం రేపింది. తన చావుకు బీఆర్ఎస్ నేతే కారణమంటూ సదరు బాధితుడు ఆవేదనతో చెప్పిన ఆడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. బీఆర్ఎస్ నేత తీరుపట్ల నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంతకీ ఏం జరిగిందంటే.. పరకాల సోమనాథ్ చిట్స్ మేనేజర్ దుమాల బాబురావు బలవన్మరణానికి పాల్పడ్డాడు. బీఆర్ఎస్ నేత నాగుర్ల వెంకటేశ్వర్లు వేధింపులు భరించలేక ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు బాబురావు ఆడియోలో తెలియజేశారు. చిట్ ఫండ్స్ బాధితుల ఒత్తిడి, బీఆర్ఎస్ రైతు రుణ విమోచన మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు తన చావుకు కారణమంటూ లెటర్ రాయడంతో పాటు ఓ ఆడియోను కూడా బాబురావు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశాడు. ప్రస్తుతం బాబురావు కాగా.. జీరో పెట్టుబడితో సోమనాథ్ చిట్స్ చైర్మన్‌గా నాగుర్ల వెంకటేశ్వర్లు ఉన్నారు.నాగుర్ల వెంకటేశ్వర్లు దగ్గర నుంచి దాదాపు కోటి 93 వేల రూపాయలు రావాల్సి ఉందంటూ మేనేజర్ ఆరోపించారు. ఈ బాధలు భరించలేకే బాబురావు పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నాని కి పాల్పడ్డాడు. అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో పరకాలలోని ప్రైవేట్ హాస్పి టల్‌కు తం˜లించారు. ప్రస్తుతం బాబురావుకు వైద్యులు చికిత్స అందజేస్తున్నారు. ఈ ఘటన జిల్లాలో ఒక్క సారిగా దుమారం రేపింది.దీనిపై బీఆర్ఎస్ నేత నాగుర్ల వెంకటేశ్వర్లు ఎలా స్పందిస్తారో చూడాలి.

క్రికెట్ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్..

ఆర్టీసీ కీలక నిర్ణయం..

హైదరాబాద్, ఏప్రిల్ 05: ఐపీఎల్ ఫ్యాన్స్‌కి టీఎస్ఆర్టీసీ గుడ్ న్యూస్ చెప్పింది. హైదరాబాద్వే దికగా ఎస్ఆర్‌హెచ్ , చెన్నై సూపర్ కింగ్స్ మధ్య మ్యాచ్ జరగనున్న నేపథ్యంలో కీలక నిర్ణయం తీసుకుంది ఆర్టీసీ యాజమాన్యం. ఉప్పల్ స్టేడియంలో జరిగే ఈ మ్యాచ్ కోసం వివిధ ప్రాంతాల నుంచి క్రికెట్ అభిమాలు తరలి వస్తుంటారు. ఈ నేపథ్యంలో నగర నలుమూల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. ఈ మేరకు గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఈడీ వి. వెంకటేశ్వర్లు ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్ వ్యాప్తంగా 24 డిపోల నుంచి మొత్తం 60 బస్సులను నడుపుతామని, సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 11.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. బస్సు సౌకర్యాల కల్పనతో క్రికెట్ మ్యాచ్ కోసం వచ్చే ప్రయాణికులకు ప్రయాణం సులభతరం అవుతుంది. ట్రాఫిక్ సమస్య కూడా తగ్గే అవకాశం ఉంది. శుక్రవారం నాడు చెన్నై సూపర్ కింగ్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య ఉప్పల్ స్టేడియంలో మ్యాచ్ జరగనుంది. గత మ్యాచ్‌లో పరుగుల వరద పారగా.. నేటి మ్యా్చ ఎలా ఉంటుందా? అని ఉత్కంఠ రేపుతోంది. ఈ మ్యా్చకు క్రికెట్ అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే.. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. మ్యాచ్ కోసం బస్సులు నడపడం వలన సంస్థకు ఆదాయం కూడా పెరుగుతుంది

ఐపీఎల్ టికెట్ల అమ్మకంపై ఎమ్మెల్యే దానం సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్, ఏప్రిల్ 5: ఐపీఎల్ టికెట్ల అమ్మకంపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఏబీఎన్ - ఆంధ్రజ్యోతితో ఎమ్మెల్యే మాట్లాడుతూ... హైదరాబాద్‌లో జరిగే మ్యాచ్‌లకు టికెట్స్ దొరకకపోవడం దారుణమన్నారు. ఐపీఎల్ టికెట్లు మొత్తం బ్లాక్ మార్కెట్ దందా జరుగుతోందన్నారు. వేలాది టికెట్లు బ్లాక్ మార్కెట్‌లో అమ్మకాలు చేస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఉప్పల్ స్టేడియం వద్ద బ్లాక్ మార్కెట్‌లో అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. బ్లాక్ మార్కెట్ దందాపై ముఖ్యమంత్రి, స్పోర్ట్స్ మినిస్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. తాను డీఎన్ఆర్ అకాడమీని నడుపుతున్నానని.. బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేసినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో టికెట్స్ దొరకకపోవడానికి ప్రధాన కారణం హెచ్‌సీఏ అని ఆరోపించారు. హెచ్‌సీఏ కాంప్లమెంటరీ పాస్ బ్లాక్‌లో అమ్ముతోందన్నారు. హెచ్‌సీఏ తీరుపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. హైదరాబాద్ సన్ రైజర్స్ మ్యాచ్‌లో హైదరాబాద్ క్రీడా కారుడు ఉండేలా చూడాలన్నారు. ఇంపాక్ట్ ప్లేయర్ కూడా హైదరాబాద్ క్రీడాకారులు లేకపోవడం దారుణమన్నారు. కిరణ్, సన్ రైజర్స్ ఫ్రాంచజీ మొత్తంపై చర్యలు తీసుకోవాలన్నారు. 10 నిముషాల్లో 45 వేల టికెట్స్ ఎలా అమ్ముడుపోతాయని ప్రశ్నించారు. టికెట్స్ అమ్మకాలు పారదర్శకంగా జరగాలని సూచించారు. వచ్చే మ్యాచ్‌లలో బ్లాక్ టికెట్స్ దందా జరగకుండా చూడాలని ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు.